# నీడలు

ఫ్రెష్‌గా తయారై అప్పుడే ఆఫీసులో అడుగు పెట్టాడు సత్యం. ప్యూను పెట్టిన నమస్కారాన్ని స్టైలుగా రిసీవ్ చేసుకుని తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. తన కెదురు వరసలో మౌనంగా తలవంచుకొని పని చేసుకుంటున్న మాధవి వైపు అభిమానంగా చూశాడు.

మాధవి తెల్లగా, అందంగా, సుకుమారంగా ఉంటుంది. విశాలమైన కళ్ళు, మల్లె మొగ్గలాంటి నాసిక, అమృతం ప్రవహిస్తున్నట్లు మెరిసే ఎర్రగా సన్నగా ఉన్న పెదవులు, నల్లగా లావుగా పొడవుగా సాగిన జడ, కుడి చేతికి రెండు బంగారు గాజులు, ఎడమ చేతికి గోల్డు కలరు రిస్టు వాచీతో సింపుల్‌గా వుంటుంది. తన పని తాను చేసుకుపోవడం తప్ప ఎవరితోనూ అనవసరంగా మాట్లాడదు.

మాధవి ముఖం చూడందే ఫైలు తాకే అలవాటు లేదు సత్యానికి. ఇది అతను ఆఫీసుకు ట్రాన్స్‌ఫరయిన రెండవరోజు నుంచి జరుగుతూ ఉంది. క్రమేణా అది ఎక్కువై ఆమె ఒక్కరోజు ఆఫీసుకు రాకపోయినా అతను ఆ రోజు పనిచేయలేని స్థితికి వచ్చాడు. దాన్నే 'ప్రేమ' అంటారని అతను తరువాత తెలుసుకున్నాడు.

సత్యం ఆమెను ఇంత గాఢంగా ప్రేమిస్తున్నా ఆమెతో తన ప్రేమ విషయం వెల్లడి చేయలేకున్నాడు. దానికి కారణం ఆమె రిజర్వ్‌డ్‌నెస్ అతన్ని కలవర పెట్టడమే. అదీగాక అంతకు ముందు ఆమెతో రొమాన్సు చేయబోయి కొందరు చెప్పుదెబ్బలు తిన్న విషయం అతని చెవిదాకా వచ్చింది.

అందుకే సత్యం ఈ విషయంలో కొత్తదారి తొక్కాడు. మాధవి సీటు ప్రక్కనే ఉన్న కాంచనతో స్నేహం మొదలు పెట్టాడు. క్రమేణ ఆమెను మంచి చేసుకుని ఆమె ద్వారా తన ప్రేమను మాధవికి తెలియజేయాలనేది అతని ఉద్దేశ్యం.

కాంచనకు గర్వం కాస్త ఎక్కువ. మగవాళ్ళంతా తన అందానికి మురిసి తన వెంట కుక్కల్లా తిరుగుతారని ఆమె నమ్మకం. అందుకే అందరితో సరదాగా మాట్లాడుతుంది. సత్యాన్ని కూడా అదే విధంగా జమకట్టింది.

మధ్యాహ్నం మూడు గంటలకు డైరెక్టరు నుండి కాంచనకు పిలుపు వచ్చింది.

కాంచన స్టైలుగా నడుస్తూ డైరెక్టరుగారి రూములోకి వెళ్ళింది. కాంచనను చూడగానే ఆయన మండి పడ్డాడు.

"ఏవమ్మా ఈరోజు ఉదయం నుంచి ఒక్క కాగితం కూడా నీ సీట్లోంచి రాలేదు. ఏం చేస్తున్నావు" అన్నాడు.

కాంచన మౌనంగా తలవంచుకొని గోళ్ళు కొరుక్కుంటూ నిలబడింది.

"ఏం మాట్లాడకుండా నిలబడితే అరచిఅరచి ఆయనే మానుకొంటాడులే అనను కుంటున్నావేమో, నిన్నిక్కణ్ణుంచి మార్చమని ఈరోజే హెడ్ ఆఫీసుకు లెటరు పెడతాను" అంటూ తలవంచుకొని తన పనిలో నిమగ్నమయ్యాడు.

ఉన్నట్లుండి భోరున ఏడుపు అందుకుంది కాంచన. ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు. డైరెక్టరు.

కాంచన ఎక్కిళ్ళు పెడుతూ "సార్ ఈ ఊరు వదలివెళ్ళి నేనెక్కడకూ పోలేను సార్. ఒంటరి ఆడదాన్ని వేరేచోట ఎలా ఉండగలను" అంది.

"సరే ఈసారికి క్షమిస్తున్నాను గాని, వెళ్ళి అర్జంటు ఫైళ్ళన్నీ మాధవి దగ్గర వ్రాయించుకో. వర్కు తెలియనప్పుడు తెలిసిన వాళ్ళ దగ్గర చెప్పించుకోవడం పద్ధతి. ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు" విసుక్కున్నాడు డైరెక్టరు.

కాంచన 'బ్రతికానురా దేవుడా' అనుకుంటూ బయట పడింది. డైరెక్టరు గది ఎ.సి. రూము కావటంతో లోపల ఏం జరిగింది బయటి వాళ్ళకు తెలియదు.

కాంచన ఎవరివైపు చూడకుండా నేరుగా తన సీట్లోకి వెళ్ళి కూర్చుంది. తరువాత అర్జంటు ఫైళ్ళన్నీ దాదాపు పది ఏరి వాటిని రెండు పాడ్స్‌లో కట్టింది. ఆ రెండు పాడ్స్ తీసుకెళ్ళి మాధవి టేబులు మీద పెట్టి నిలబడింది. మాధవికి దాని సారాంశం తెలుసు. ఫైల్సు వ్రాయమని అడగడం కాంచనకు ఇన్సల్టు.

మాధవి తలెత్తి 'ఇక నువ్వెళ్ళు' అన్నట్లు కళ్ళతోనే సైగ చేసింది. కాంచన వెళ్లి తన సీట్లో కూర్చుండిపోయింది. మాధవి వంచిన తల ఎత్తకుండా ఆఫీసు ఫైల్సు క్షుణ్ణంగా చదివి రిప్లయిస్ వ్రాస్తోంది.

సాయంత్రం ఆరు అయ్యే సరికి మాధవి ఫైల్సు వ్రాయడం పూర్తి చేసింది. తిరిగి వాటిని రెండు ఆఫీసు పాడ్స్‌లో కట్టి లేచి నిలబడి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంది. తరువాత ఈ పాడ్స్ రెండు పట్టుకొచ్చి కాంచన టేబులు మీద పెట్టి మౌనంగా వెళ్ళిపోయింది. కాంచన చూసీ చూడనట్లు బింకంగా ఉండిపోయింది.

కాంచన పాడ్స్ విప్పి మాధవి వ్రాసిన ప్రతి ఫైలు మీదా ఇనిషియల్ వేసి తిరిగి కట్టింది. అటెండరును పిలిచి ఆ పాడ్స్ డైరెక్టరుగారికి పంపింది.

"కాంచనగారూ వెళ్దామా" అన్నాడు అప్పటి వరకూ ఆమెను ఓదారుద్దామని ఎదురుచూస్తున్న సత్యం.

"వెళ్దామండీ" అంటూ ఆమె టేబులు డ్రాయరులో ఉన్న నవలల్ని హ్యాండు బాగులో వేసుకుని జిప్ మూసింది.

ఇద్దరూ బయటికి నడిచారు.

"ఏమిటండీ ఈరోజు అదోలా ఉన్నారు. డైరెక్టరుగాను మిమ్మల్నేమీ అనలేదుగదా" ఆందోళనగా అన్నాడు సత్యం.

ఫక్కున నవ్వింది కాంచన. అలా చాలాసేపు నవ్వింది.

"మీరు లోపల్నుంచి చాలా కోపంగా వస్తేనూ. ఏదో జరిగుంటుందని అనుకున్నాను." నొచ్చుకుంటూ అన్నాడు సత్యం.

"నిజంగానే జరిగిందండీ సత్యంగారూ" అంది కాంచన నవ్వడం ఆపి గర్వంగా.

సత్యం ఆమె ఏం చెబుతుందో వినడానికి సిద్ధపడ్డాడు.

"అదేమిటోనండి డైరెక్టరుగారికి నన్ను చూడగానే ఎక్కడెక్కడి బాధలూ గుర్తుకొస్తాయి. తన భార్య తనను సరిగా చూడదట. పెద్ద కూతురు నిత్య రోగట. మిగతా పిల్లలు చెప్పిన మాట వినరట. ఆఫీసులోనేనట తన జబర్దస్తీ. ఇంటి దగ్గర తనను చాలా హీనంగా చూస్తారట. 'ఆఫీసులో నీ ఒక్క దానివే కాంచనా సిన్సియర్‌గా పనిచేసేది. అందుకనే నీకు చెప్పాలని పిస్తుంది.' అంటూ ఏడ్చాడు. మీకు తెలుసు కదా సత్యంగారూ. ఒకరి బాధలు వింటే నేనూ దుఃఖిస్తానని. అందుకే నేనూ ఏడ్చాను" అంటూ ఆఫీసరు మీద జాలి కురిపించింది.

ఆమె చెప్పిన అబద్ధాలు విన్న సత్యానికి నవ్వొచ్చింది. అయినా నవ్వాపుకుని, "మరి మాధవికి ఫైళ్ళు..." తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

"అదా నీ పక్క సీటు మాధవికి పని తెలియదు. కొన్ని ఫైళ్ళు ఆమెకివ్వు. ఆమె కొంత వర్కు నేర్చుకుంటుంది అన్నాడు. అందుకే పోనీలెమ్మని కొన్ని ఫైళ్ళిచ్చాను వ్రాయమని" అంది స్టైలుగా.

• • • • • • • • •

రోజులు, నెలలు మారుతున్నాయి.

"ఎక్కడే నీ ప్రేమ పిచ్చోడు ఇంకా రాలేదు" అంది హేమ తన సీట్లో కూర్చుంటూ.

"వస్తాడే వస్తాడు. ప్రియురాల్ని ఆకర్షించడం కోసం ఎన్ని తంటాలు పడుతున్నాడో నిదానంగా మేకప్ చేసుకుని రానీ" అంది రమ.

"వాడికి నేను ప్రియురాల్నా. డామ్ ఇన్సల్టింగ్. ప్రేమికుడంటే డేరింగ్ అండ్ డాషింగ్‌గా ఉండాలి. ఇలా కాళ్ళా వేళ్ళా పడతాడా ఎక్కడన్నా." అంది కాంచన కుర్చీలో వెనక్కువాలి కాళ్ళూపుతూ.

ఎందుకో కాంచన మాటలు మాధవి మనసు చివుక్కు మనిపించాయి. సత్యం పట్ల జాలి నిండిపోయింది.

"కాంచనా, ఒక వ్యక్తిని పరోక్షంగా మనం ఏమీ అనకూడదు. సత్యం ప్రవర్తన బట్టి చూస్తే అతని నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాడని తెలిసిపోతోంది. నీకు ఇష్టం లేనప్పుడు అతనితో ఖచ్చితంగా చెప్పెయ్. అతని జీవితంతో ఆడుకోవడం నీకు న్యాయం కాదు" అంది మాధవి.

కాంచన ముఖం ఇంతదయి పోయింది.

"ఇది నా వ్యక్తిగత విషయం. నా ఇష్టం వచ్చినట్లు మాట్లడతాను. నేనెప్పుడూ అతన్ని ప్రేమించలేదు. అతనే నా వెంటపడ్డాడు. ఆ జ్ఞానం అతని కుండాలి" కరుగ్గా అని మాధవికి ముఖం చూపించలేక బాత్ రూమ్‌వైపు వెళ్ళిపోయింది.

ఆరోగ్యం బాగోలేని ఒక బంధువుని చూడ్డానికి హైదరాబాదుకు వెళ్ళాలని సెలవు పెట్టడానికి వచ్చిన మాధవి ఇక ఏమీ మాట్లాడకుండా ఆఫీసరుకు లీవ్ లెటరిచ్చి వెళ్ళిపోయింది.

• • • • • • • • •

పదిహేను రోజులు లాంగ్ లీవ్ తరువాత ఆరోజే ఆఫీసుకి వచ్చింది మాధవి.

సత్యంవైపు చూసిన ఆమెకు జాలితోగుండె తరుక్కుపోయింది. అతను గెడ్డం పెంచేశాడు. తల దువ్వుకోలేదు. బట్టలు మాసి ఉన్నాయి. చాలా రోజులుగా నిద్రలేనట్లు కళ్ళు లోపలికి పీక్కుపోయి ఉన్నాయి. మనిషి బాగా తగ్గి చాలా డల్‌గా కనిపించాడు.

"సత్యంగారూ మీతో మాట్లాడాలి. సాయంత్రం నాతో రాగలరా" అంది మాధవి లంచ్ అవర్లో భోజనానికి పోకుండా కూర్చొని ఉన్న సత్యంతో.

ఏదో ఆలోచిస్తున్న సత్యం ఉలిక్కిపడి "అలాగే నండీ" అన్నాడు. మాధవి మౌనంగా వెళ్ళిపోయింది. ఇప్పటి వరకు సత్యంను అంత అభిమానంగా పలకరించిన వారు ఎవరూ లేరు. గేలిచేసే వాళ్ళు తప్ప. అందుకే ఆమె పట్ల సత్యం హృదయం ప్రేమతోనే గాక కృతజ్ఞతతో కూడా నిండిపోయింది.

ఆ సాయంత్రం బీచ్‌లో ఎదురెదురుగా కూర్చున్నారు సత్యం, మాధవి. ఆఫీసు విషయాలు కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

"సత్యంగారూ, మీరు నిజంగా కాంచనను ప్రేమిస్తున్నారా" హఠాత్తుగా అడిగింది మాధవి.

సత్యం వెంటనే మాట్లాడలేక పోయాడు. తను కాంచనను ప్రేమిస్తున్నాననే భావం మాధవిలో ఉంది. ఆ భావనను ఎలా పోగొట్టాలా అని ఆలోచిస్తున్నాడు.

"ఆమె మనసు ఎలాంటిదో మొదట తెలుసుకుని తరువాత పెళ్ళి విషయం ఎత్తి ఉండాల్సింది"

దానికీ ఏం మాట్లాడలేదు సత్యం.

"కాంచనలో బాల్య చాపల్యం ఇంకా పోలేదండీ సత్యంగారూ. జీవితం గురించి సీరియస్‌గా ఆలోచించలేకుండా ఉంది. ఆమెకు స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొనే శక్తిలేదు. తల్లిదండ్రుల మీద ప్రతిదానికీ ఆధారపడుతుంది."

"ఇవన్నీ మీకెలా తెలుసండీ మాధవిగారూ"

"వాళ్ళిల్లు మా వీధిలోనేనండి. చిన్నతనం నుంచీ కాంచన గురించి వాళ్ళ కుటుంబం గురించి నాకు బాగా తెలుసు. వాళ్ళ కుటుంబం చాలా మంచిది. పెంకితనం తప్ప మరే దుర్గుణం లేదు కాంచనలో" అంది మాధవి నవ్వుతూ.

ఆలోచనలో మునిగిపోయాడు సత్యం కొద్ది సేపు.

"మీకు కాంచనతో పెళ్ళి కావాలంటే ఒకే ఒక మార్గముంది"

"అయితే కాంచనను నేను నిజంగా ప్రేమించానని మీరు భావిస్తున్నారా"

"కొంతమందిని చూడగానే వాళ్ళు ఎంత మంచి వాళ్ళో మనకి మొదటి చూపులోనే అర్థమయి పోతుదండీ. మీరు ఎంత నిజాయితీగా కాంచనను ప్రేమిస్తున్నారో నాకు బాగా తెలుసండీ. 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్' అని అన్నారు గదండీ."

'మాధవీ ఇవే మాటలు కాంచన స్థానంలో నిన్ను ఊహించుకొని మాట్లాడి ఉంటే ఎంతో సంతోషించేవాణ్ణి' అని మనసులో అనుకొని. "కాంచన ఇంత అవమానించి కూడా ఇంకా నన్ను పెళ్ళి చేసుకుంటుందంటారా. ఎలా?" అన్నాడు పైకి.

వెరీ సింపుల్. మీరు మీ తల్లిదండ్రుల్ని తీసుకొని కాంచన ఇంటికి పెళ్ళి చూపులకి వెళ్ళండి. కాంచన తల్లిదండ్రులకు మీరు తప్పక నచ్చుతారు. వాళ్ళ నిర్ణయాన్ని కాంచన కాదనదు" అంది మాధవి నమ్మకంగా.

మాధవి మాటలకు చిరునవ్వు నవ్వాడు సత్యం. సత్యం విషాదం వదలి ఆమాత్రం చిరునవ్వు నవ్వినందుకు ఎంతో సంతోషించింది మాధవి. తన సమస్యకు పరిష్కారం చూపడం కోసం మాధవి ఎంత ప్రయత్నం చేసిందో అతనికి అర్థమయింది.

కొద్దిసేపు మౌనంగా ఉన్న సత్యం హఠాత్తుగా అన్నాడు.

"మీరు నా సమస్య కొక పరిష్కారం చూపారు. బాగానే ఉంది. నేనొకటి అడుగుతాను. మీరు దానికి సరైన సమాధానం చెబుతారా".

"ఏమిటి" ఆశ్చర్యంగా అడిగింది మాధవి.

"మీ రెందుకు ఇంతవరకు పెళ్ళి చేసుకోలేదు. మీరెవరినైనా ప్రేమించారా"

ఆమె ముఖం క్షణాల్లో నల్లగా మారిపోయింది. ఆమె సీరియస్‌గా మారేసరికి చాలా బాధపడ్డాడు సత్యం.

"సారీ మాధవిగారూ, నేను ఇంత చొరవ తీసుకున్నందుకు క్షమించండి." అన్నాడు బాధగా.

"నో... నో.. మీ లాంటి మంచి మనసున్న వాళ్ళకు నాగుండెల్లో తిరిగే సుడిగుండాల్ని చెప్పుకోవడంలో ఎలాంటి ప్రమాదం లేదు. అందుకే మీకు చెబుతాను" అంది మాధవి.

ఈమెకు కూడా ఇన్ని బాధలున్నాయా అన్ని ఆశ్చర్యపోయాడు సత్యం.

మాధవికి తన గత జీవితంలోని నీడలు గుర్తొచ్చాయి. మాధవి తల్లికి మాధవి ఒక్కతే సంతానం. మాధవికి పదేళ్ళ వయసులో మాధవి తల్లికి లెప్రసీ వచ్చింది. అది లెప్రసీ అని తెలియక మామూలు మచ్చలని కొంతకాలం అశ్రద్ధ చేసారు. బాగా ముదిరిన తరువాత గాని దాని తీవ్ర పరిణామం వాళ్ళకు అర్థం కాలేదు. అప్పుడు ట్రీట్‌మెంటు మొదలు పెట్టారు. డాక్టరుకూడా ధైర్యం చెప్పాడు. కాని మాధవి తల్లి బాగా దిగులుపడి పోయింది. తనకు పెళ్ళి కావలసిన కూతురుంది. తను బ్రతికి ఉన్నంతకాలం తన కూతురుకు పెళ్ళి కాదని నిర్ణయించుకుని విషంతాగి ఈ లోకం వదిలి వెళ్ళిపోయింది. అప్పుడు మాధవి బి.ఎ. మొదటి సంవత్సరం చదువుతోంది.

దీంతో మాధవి బాగా దిగులుపడిపోయింది. చదువు మానేసి ఉద్యోగ ప్రయత్నాల్లో పడింది. చివరకు ఎలాగో ఉద్యోగం సంపాదించింది. ఆఫీసులో సిన్సియర్‌గా పనిచేస్తూ అందరి అభిమానాన్ని పొందింది. సంవత్సరం తరువాత అదే ఆఫీసులో ఉద్యోగంలో చేరిన కాంచన మాధవి తల్లి సంగతి అందరికీ చెప్పేసింది. అప్పటి వరకూ మాధవిని పెళ్ళిచేసుకోమని పదిసార్లు అడిగిన అదే ఆఫీసు మేనేజరు 'మీ అమ్మకు లెప్రసీ అటగా. సారీ! నిన్ను చేసుకోను. అయితే దానికి మాత్రం నా అభ్యంతరం లేదు' అంటూ డొంక తిరుగుడుగా మాట్లాడాడు ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు.

అప్పటి వరకు తనను పెళ్ళి చేసుకోమని కాళ్ళావేళ్ళా పడిన వెధవ ఒక్కసారిగా ఇలా అనేసరికి మండిపడింది.

"ఇడియట్. నన్నంత మాటంటావట్రా" అంటూ చెప్పుతీసుకుని కొట్టింది. ఈ విషయం ఆఫీసంతా తెలిసిపోయింది. అతను ట్రాన్స్‌ఫరు పెట్టుకొని వెళ్ళిపోయాడు. క్రమక్రమంగా మాధవి తన చుట్టూ 'రిజర్వుడు నెస్' అనే వలయాన్ని ఏర్పరచుకుని అందులో కూర్చుండి పోయింది. ఆమె సీరియస్ నెస్ చూసి ఎవరూ ముందుకు రాలేక పోయారు.

"అరె ఏమిటండీ. కన్నీరు కారుస్తారు" కంగారుగా అన్నాడు సత్యం. కొంత సేపటికి కుదుట పడింది మాధవి.

• • • • • • • • •

ఎప్పుడూ లేంది ఆరోజు అరగంట ముందుగా ఆఫీసుకి వచ్చింది మాధవి. కాంచన ముఖంలోని సిగ్గునీ, సత్యం ముఖంలోని ఆనందాన్ని చూడాలనేది ఆమె కోరిక. కాని వాళ్ళింకా

రాలేదు. ఆశ్చర్యంగా ఆరోజు ఆమె అడ్రసుకొక ఉత్తరం వచ్చింది. ఆతృతగా చించింది ఉత్తరం చదివిన ఆమెకు అది కలో నిజమో అర్థం కాలేదు. అది సత్యం వ్రాసిన ఉత్తరం.

మాధవిగారూ!

నేనిలా ఉత్తరం వ్రాస్తానని మీరు కలలో కూడా ఊహించి ఉండరు కదూ. నేను ఎప్పటి నుంచో వ్రాయాలను కున్న ఉత్తరం, నిన్న మీతో మాట్లాడిన తరువాత ఇక క్షణం ఆలస్యం చేయడం కూడా తప్పే అనుకున్నాను. మాధవిగారూ నేను ఎప్పుడూ కాంచనను ప్రేమించలేదండి. నాకు జీవితపు విలువలు తెలుసండి. రాయికి, రత్నానికి ఉన్న భేదం కూడా తెలుసండి. కాంచన మనస్తత్వానికీ నాకూ ఎలా పొసుగుతుందండి. దుందుడుకు నిర్ణయాలు తీసుకుని జీవిత మార్గానికి ఎందుకు అవరోధం కలిగించుకుంటానండీ.

చాలా కాలం నుంచి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. కాని మీ రిజర్వుడునెస్ చూసి మీకు నా ప్రేమను వెల్లడించడానికి జంకాను. కాని నిన్న మీతో మాట్లాడిన తరువాత నా ప్రేమ వెయ్యింతలు పెరిగి నా ప్రేమను వెల్లడి చేసుకోవడానికి ధైర్యాన్ని కూడా కలిగించింది. అందుకే ఈ ఉత్తరం.

మాధవిగారూ! నాకు తండ్రిలేదు. తల్లి మాత్రమే ఉంది. మా అమ్మతో మీ గురించి సమస్తమూ చెప్పాను. మా అమ్మ నాకంటే ముందే 'రేయ్ నువ్వు ఆ అమ్మాయిని తప్పక చేసుకోవాలిరా. అంతమంచి పిల్ల నాకు కోడలుగా వస్తే గర్విస్తాను' అంది. 'అమ్మా ఎందుకయినా మంచిది ముందు ఆమె నాన్నతో మాట్లాడు. ఆమె మనసేమిటో నేను తెలుసుకుంటాను' అన్నాను. సరేనంది. నిన్న ఆదివారం పెళ్ళి చూపులకు వెళ్ళింది కాంచన ఇంటికి కాదండి. మీ ఇంటికి. మీ ఇంటికి వచ్చి, 'కాంచన ఇంటికి పెళ్లి చూపులకు వెళ్లి వస్తున్నామని' మీతో చెప్పింది అబద్ధం. మా అమ్మ ద్వారా విషయం విన్న మీ నాన్న ఆనంద భాష్పాలురాల్చారు.

ఇంటికి వచ్చిన అమ్మకు ఎంతసేపూ నీ గొడవే. 'ఒరేయ్ మాధవి సింపుల్‌గా నీట్‌గా ఎంత అందంగా ఉందిరా. అమె అందం ముందు ఆభరణాలు వెల వెల బోతాయిరా' అంటూ ఒకటే పొగడడం. మీరు 'కాయా! పండా!' అనిన నన్నడిగినప్పుడు మీరు నన్ను ఒప్పుకుంటారనే ఆశతో పండనే అన్నాను.

మాధవిగారు అనే బదులు, డియర్ మాధవీ అని పిలిచే లైసెన్సు ఇస్తారుగా. నా నమ్మకాన్ని వమ్ము చేయరనే ఉద్దేశ్యంతో ఈ రోజు సాయంత్రం ఆరుగంటల నుండి రాత్రి పది గంటల వరకు ఈ క్రింది ఫోన్ నంబర్లో ఉంటాను. తప్పక మాట్లాడతారు గదూ.

ఇట్లు

మీ నిర్ణయం కోసం ఎదురు చూస్తూ....

సత్యం

క్రింద ఫోన్ నంబరు వ్రాసి ఉన్నాడు.

ఇంతకాలం తన మీద ఒక మచ్చవేసి తనను క్షణం క్షణం బాధించే ఈ క్రూర సమాజపు మాటలకు కుంచించకుపోయి చీకటి గుహలా తయారైన ఆమె గుండెలోకి వెలుగు కిరణం ప్రవేశించింది. అది ఆంతకంతకూ విశాలమై ఆమె గుండెను కాంతితో నింపింది.

ఉత్తరాన్ని అప్యాయంగా గుండెలకు హత్తుకుంది ✸

**(పల్లకి వీక్లీ, తేది 8-12-1993)**